క్లుప్తంగా

సత్ప్రవర్తన అలవర్చుకోండి



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం: క్షణికావేశంలో తప్పులు చేసి సబ్‌జైలులో శిక్షలు అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకుని సమాజంలో జీవనం సాగించాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉంటున్న ఖైదీలతో మాట్లాడుతూ.. ఏ కేసుల్లో నిందితులుగా ఎప్పటి శిక్ష అనుభవిస్తురన్న విషయాలు తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా శిక్ష అనుభవిస్తున్న వారికి న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. పదేపదే తప్పులు చేసి జైల్లోకి రావడం వల్ల కుటుంబాలు దూరం అవుతాయన్నారు. ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారంలో నాణ్యత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో జైలర్ చంద్రశేఖర్, న్యాయవాదులు సిద్ధు, కృష్ణమూర్తి, జ్ఞానేష్, రవికుమార్ లోక్ అదాలత్ సభ్యులు శారద తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసత్య డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. నేడు పురుషుల కంటే మహిళలే ఎంతో ముందంజ వేస్తూ ఎంతో బాధ్యతాయుతంగా మెలుగుతున్నారన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్, న్యాయవాది నాగరాజు, ప్రిన్సిపాల్ కేశవయ్య, అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

పరామర్శ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన గీత (35) అనే వివాహిత గుండెపోటుతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు ఎల్లారెడ్డి, అమర్, బాబు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విజయం

పెనుకొండ: ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతోనే విజయం సిద్ధిస్తుందని డీవైఈఓ రంగస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రగతి, గ్లోబల్‌జెన్ పాఠశాలల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో చదువుతూ ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్తీక్, కరస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



పౌష్టికాహార పంపిణీపై ఆరా తీస్తున్న సీడీపీఓ రెడ్డి రమణమ్మ

గోరంట్ల: స్థానిక రాజీవ్ కాలనీలోని 1, 2, 3 నంబర్ అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం హిందూపురం ప్రాజెక్టు సీడీపీఓ రెడ్డి రమణమ్మ, సూపర్‌వైజర్ రజితతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల్లో రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా అందజేస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూలీలందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలో కూలీలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇచ్చి, కూలీలందరికీ పనులు కల్పిస్తున్నామని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. శనివారం కల్లుమర్రి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. పనులు చేసే చోట నీడ, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

రొద్దం: 2021–22 సంవత్సరంలో మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. శనివారం వివిధ గ్రామాల్లో ఎస్‌ఆర్‌పీ మల్లికార్జున ఆధ్వర్యంలో డీఆర్‌పీలు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.13 కోట్లతో జరిగిన పనులను సామాజిక బృందం తనిఖీ చేస్తుందని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఏపీఓ జగదీశ్ తెలిపారు. ఉపాధి పనులతో పాటు గ్రామ సచివాలయాలు, సిమెంట్ రోడ్లను, జగనన్న లేఅవుట్లలో జరిగిన పనులను పరిశీలించారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

- 14వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



ముస్తాబైన రొళ్ల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 14వ తేదీ వరకూ జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది మాఘ మాసం అనంతరం పాల్గుణ శుద్ధ త్రయోదశి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 5వ తేదీన అంకురార్పణ, 6న కలశ స్థాపన, స్వామి కల్యాణోత్సవం, యోగీశ్వరాధన, 7న బ్రహ్మరథోత్సవం, 8న వసంతోత్సవం, మీసలు (సేకరణ) కలియుట, రొళ్ల కొండపై దివ్య జ్యోతి దర్శనం, 9న గరుడోత్సవం, 10న పూల పల్లకీ ఉత్సవం, రాత్రికి వీరగాస నృత్యం, 11న దేవత సంకీర్తనాలు, 12న భూతప్ప సేవలు (ఉత్సవం) తలనీలాలు సమర్పణ, 13న 101 ప్రసాదాల వినియోగం, భక్తులతో ముడుపుల ఉత్సవం, 14న మహామంగళారతి, భక్తులకు ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఆకట్టుకోనున్న భూతప్పల ఉత్సవం..

ఉత్సవాల్లో భాగంగా ముఖ్యంగా 12వ తేదీన జరిగే భూతప్పల ఉత్సవం ఆకట్టుకోనుంది. ఆ రోజున భూతప్ప స్వామి కాలిస్పర్శ తాకితే తమ కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు, సంతాన భాగ్యం లేనివారు, పెళ్లిళ్లు కాని యువతులు ఇతరత్రా సమస్యలు ఉన్న తదితరులు ఈరముద్దమ్మ దేవి ఆలయం నుంచి స్వామి వారి ఆలయ ప్రాంగణం వరకూ కిలోమీటర్ల మేర చన్నీటి స్నానం ఆచరించి తడి దుస్తులతో పిల్లలు, పెద్దలు బోర్ల పడుకోవడం ప్రత్యేకత. అదే విధంగా 7వ తేదీ, 12వ తేదీన దాతల సహకారంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం మడకశిర ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా శిరా, మధుగిరి, పావగడ, మడకశిర, పెనుకొండ ఇతరత్రా ప్రాంతాల నుంచి బస్సులు నడపాలని కమిటీ సభ్యులు, భక్తులు కోరుతున్నారు.

18న స్పెషల్ లోక్‌అదాలత్

హిందూపురం: రాజీకాదగిన వైవాహిక సంబంధ కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్న ఇరువర్గాలు కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యంగా మరణం కేసులు, పరస్పర అంగీకారంతో దాఖలైన విడాకుల కేసులు, వైవాహిక సంబంధ రాజీ కాదగిన కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ ఉద్యోగులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన పెంచి సాధ్యమైనంత ఎక్కువగా కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసుల వివరాలను న్యాయమూర్తులు శ్రీధర్, స్పందన, రాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే కక్షిదారులతోనే నేరుగా చర్చించి పరిష్కరించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగప్ప, న్యాయవాదులు సిద్ధు, రవికుమార్, అబ్దుల్లా, లోక్ అదాలత్ సభ్యులు హేమావతి తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం రోజూ నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని ఎంఈఓ శ్రీధర్ కోరారు. శనివారం మండలంలోని ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత, సోమఘట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎం.రాయాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను పరిశీలించారు. ట్యాబ్‌ల వినియోగంపై సూచనలిచ్చారు. సోమఘట్ట పాఠశాలలో విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



రొళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



హిందూపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



పెనుకొండలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొళ్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని హొట్టేబెట్ట, రొళ్ల హెచ్‌పీహెచ్‌ఎస్, కేజీబీవీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్సియల్ పాఠశాలతో పాటు హొట్టేబెట్ట, రొళ్ల-1, 2 సచివాలయాలు, బాలాజీ రూరల్ అప్పర్ ప్రైమరి ప్రైవేట్ పాఠశాలలో ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కరపత్రాలను అందించారు. తొలుత కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని, స్వామివారి పాదల వద్ద కరపత్రాలను ఉంచి విశేష పూజలు చేయించారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఉన్న విభాగాల వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లో ఉన్న పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించాలన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

హిందూపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలని హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రశాంత్ నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయించాలన్నారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. అందించిన ఓటరు జాబితా ప్రకారం ఓటర్లను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలు వివరించాలన్నారు. ప్రస్తుతం జరిగిన పారిశ్రామిక సదస్సుతో త్వరలోనే భారీ ఎత్తున పరిశ్రమలు కొలువుదీరి లక్షలాదిమంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందుతాయని తెలియజేయాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ టీచర్లు, పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. టీడీపీ చెప్పే మాయ మాటలు నమ్మితే మోసపోతారన్నారు. గతంలో చంద్రబాబు మోసపూరిత పాలన తెలియంది కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, ఏజీపీ భాస్కరరెడ్డి, ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, తయాబ్, రామాంజినేయులు, భాస్కర్‌నాయక్, సద్దాం, కో-ఆప్షన్ మెంబర్లు వెంకటరామిరెడ్డి, నేమతుల్లా, ముహీబా మున్నీర్, నాయకులు మండల అగ్రి కమిటీ చైర్మన్ కొండల రాయుడు, జయశంకరరెడ్డి, బాబు, యాసిన్, గణేష్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎంపీపీ ఈరన్న, మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క కోరారు. శనివారం మండలంలోని నిడ్రగట్ట, హేమావతి, బసవనపల్లి, కె.శివరం గ్రామాల్లోని పాఠశాలలు, సచివాలయాల్లోని పట్టభద్రులను కలిశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కరపత్రాలు అందజేశారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గగన, వైస్ ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులు రసూల్ బాషా పాల్గొన్నారు.

గోరంట్ల: ఈనెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్ ఓటర్లను కోరారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలసి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, సచివాలయ కన్వీనర్ల మండల అధ్యక్షుడు రంగారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు జబ్బార్, నాయకులు లక్ష్మీనరసింహరెడ్డి, షరీఫ్, సుబహన్ పాల్గొన్నారు.

గుడిబండ: వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, జేసీఎస్ కన్వీనర్ కె.శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మినారాయణ, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, సత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్ వాల్మీకి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ బాబుల్‌రెడ్డి

రొద్దం: వైఎస్సార్‌సీపీ నాయకులు విభేదాలను పక్కనపెట్టి, అందరినీ కలుపుకుని సమన్వయంతో పని చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ బాబుల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మనమందరం సమష్టిగా పని చేస్తే గెలుపు కాయమన్నారు. అనంతరం మండలంలో పార్టీ స్థితిగతులపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న గ్రామాలు శుభ్రంగా ఉండాలని, పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యవంతులు అవుతారని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప తెలిపారు. శనివారం తాలూకాలోని నిడుగల్ గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సామాజిక సేవలకు ప్రతీకగా నిలవాలన్నారు. చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామస్తులు విద్యార్థులను తమ ఇంటి పిల్లలా చూసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. జాతీయ సేవా యోజన విద్యార్థులు క్రమశిక్షణ, సేవా మనోభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శిబిరార్థులు రాఘవేంద్ర, రామాంజని, ఐక్యూఎస్‌సి అధికారి కెంపయ్య, నాయయదకుంటె పిడిఓ మంజునాథ్, అధ్యాపకులు లింగరాజు, సతీశ్ కుమార్, రవి, శశి కిరణ్, ప్రహ్లాద, మల్లయ్య, రమేశ్, గురుమూర్తి, శివకుమార్ పాల్గొన్నారు.

8న బాలికల క్రికెట్ పోటీలు

పావగడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న పట్టణంలో నిర్వహించే అండర్-19 బాలికల క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీపీఎస్ ఈఓ శివరాజయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్ల వివరాలను ఈనెల 6లోపు స్థానిక వ్యాయామ శిక్షణాధికారి చిదానంద స్వామి (9481291470) లేదా పంచాయతీ అభివృద్ధి అధికారి మంజునాథ్ (9535095646)కు అందించాలన్నారు.

ఓటర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు నియమ నిబంధనలు పాటించాలని సబ్‌కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఓటరు గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు ఏదో ఒకటి తీసుకుని రావాలని సూచించారు. ఓటు స్పష్టంగా అభ్యర్థి గీతలోపే ఉండాలని, ప్రాధాన్యత క్రమంలో ఓటు వేసుకోవచ్చన్నారు. ఓటు అన్నది సంఖ్య రూపంలో ఉండాలని, ఎన్నికల సిబ్బంది ఇచ్చిన పెన్నుతోనే ఓటు వేయాలని సూచించారు. వేలి ముద్ర వేయడం, చేతి రాత రాయడం చేస్తే ఓటు తిరస్కరించబడుతుందన్నారు. గ్రామాల్లో ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. మిగిలిన మరో 120 ఓట్ల స్లిప్పులు త్వరలోనే అందజేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను సబ్‌కలెక్టర్ సమగ్రంగా వివరించారు. సమావేశంలో నాయకులు ఎంపీపీ గీత, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, రమేష్, ప్రసాద్, రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారాలు జరిగేలా చూడండి

హిందూపురం టౌన్: పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవన సముదాయంలోనే వ్యాపారాలు జరిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని న్యూ వెజిటబుల్ మార్కెట్ నూతన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నరసింహులు, గౌరవాధ్యక్షుడు మునిరాజు, జాయింట్ సెక్రటరీ ఇర్ఫాన్ బాషా, మురళీ కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 100 షాపులతో నూతనంగా కూరగాయల మార్కెట్ నిర్మించారని, వాటిని వేలం పాట ద్వారా దక్కించుకుని లక్షల రూపాయలు అడ్వాన్స్ చెల్లించామన్నారు. అయితే వ్యాపారాలు జరగక అద్దెలు సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. తాము పూర్తిగా నష్టపోయామన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, పార్కింగ్ స్థలంలోనూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. మార్కెట్ పరిసర 2 కిలోమీటర్లలో ఎలాంటి తోపుడుబండ్లు లేకుండా చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మార్కెట్‌కు ఎదుటే తోపుడుబండ్లలో వ్యాపారం జరుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. దీనికి తోడు రైతు బజార్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్, అధికారులు స్పందించి రైతుబజార్, అలాగే మార్కెట్‌కు 2 కి.మీ పరిధిలో ఎలాంటి తోపుడుబండ్లు లేకుండా చేయాలన్నారు. మార్కెట్‌లోనే మొత్తం వ్యాపారాలు జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా ఈ విషయాన్ని మార్కెట్ వ్యాపారులు శనివారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రం దాటిన వలంటీర్ సేవలు

- హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత

మడకశిరరూరల్: మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ గంగాధర్ శనివారం హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసినట్లు గ్రామ కార్యదర్శి ఆనంద్‌కుమార్ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రొద్దం: ఈనెల 13న జరిగే పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని పార్టీలు సహకరించాలని తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలోని సమావేశ భవనంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

7లోపు ఓటరు స్లిప్పులు అందజేయాలి..

వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 7వ తేదీ లోపు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఎన్నికలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగస్వామి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

హిందూపురం: బెంగుళూరు రోడ్డులోని రాజధాని ఫంక్షన్ హాల్‌లో శనివారం హిందూపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూపతి ఆధ్వర్యంలో జాతీయ లైన్‌మెన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో లైన్‌మెన్లు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలు, సిబ్బందికి సేవలందించాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

రొళ్ల: వేసవిలో ముందు జాగ్రత్త చర్యగా తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచులతో కలిసి పరిష్కరించేందుకు కార్యదర్శులు శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి కృషి చేయాలన్నారు. ఈఓఆర్డీ కిష్టప్ప పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

గోరంట్ల: చింతలపల్లి గ్రామానికి చెందిన సూరప్ప (54) కడుపు నొప్పి భరించలేక శనివారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. వివరాలు.. సూరప్ప గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు మారెమ్మ గుడి వెనుక భాగంలోని చెట్టుకు పంచెతో ఉరేసుకుని మృతి చెందాడు. సూరప్ప భార్య చౌడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయానికి కృషి చేయండి

పెనుకొండ: పశ్చిమ రాయలసీమ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న నగరూరు రాఘవేంద్ర విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన బీజేపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న తొమ్మిది రోజులు ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరినీ బూత్‌ల వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించాలన్నారు. సమావేశంలో నాయకులు రామాంజినేయులు, సూరి, నాగప్ప, సుభాష్, హనుమంతు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి మార్కులు

హిందూపురం టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ఎంపీడీఓ నరేంద్ర, ఎంఈఓ గంగప్ప అన్నారు. శనివారం మండల పరిధిలోని మలుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా రుచి చూశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇష్టపడితే ఎంతటి కష్టమైన సబ్జెక్ట్ అయినా సులభమవుతుందన్నారు. పరీక్షలకు భయపడరాదని, ఒత్తిడికి గురికారాదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, హెచ్‌ఎం ప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు.

అరటితోట దగ్ధం

పెనుకొండ రూరల్: స్థానిక 44వ జాతీయ రహదారి పక్కన హరిపురం సమీపంలో శనివారం మధ్యాహ్నం ఆకతాయిల చేష్టలకు అరటి తోట దగ్ధమైంది. రైతు రాధాకృష్ణ తెలిపిన వివరాలు.. కొందరు ఆకతాయిలు జాతీయ రహదారి పక్కన ఉన్న ముళ్ల పొదలకు నిప్పు పెట్టారు. మంటలు అధికమై తోటకు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఈ ఘటనలో రెండు ఎకరాల్లో సాగు చేసిన అరటి, మామిడి చెట్లు కాలిపోయాయి. అలాగే మోటారు, డ్రిప్, ఇతర సామగ్రి దగ్ధం కావడంతో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పెనుకొండ అడవికి నిప్పు

పెనుకొండ: పట్టణ సమీపంలోని అటవీ ప్రాంతానికి నిత్యం ఎక్కడో ఒకచోట ఆకతాయిలు నిప్పు పెట్టడంతో కాలిపోతోంది. శనివారం పేలుకమ్మ గుడి సమీపంలో అడవికి నిప్పు పెట్టడం పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పర్యావరణం విలువ తెలియని కొందరు వ్యక్తులు అటవీ ప్రాంతానికి ఒక పథకం ప్రకారం నిప్పు పెడుతూ కాల్చి వేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాం

పావగడ: తాలూకా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను అన్ని వేళలా ఆదుకుంటామని స్థానిక విధానసభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్ భరోసా ఇచ్చారు. తాలూకాలోని కే రాంపురం గ్రామంలో శనివారం కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి వ్యక్తికి 7 కేజీల బియ్యం అందించిందని అయితే బీజేపీ సర్కారు 7 కేజీల బియ్యాన్ని 5 కేజీలకు తగ్గించి పేదల కడుపు కొట్టిందని ఆరోపించారు. వచ్చే స్థానిక విధాన సభ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతకుముందు దొడ్డహళ్ళి, చిక్కహళ్ళి, తిమ్మమ్మనహళ్ళి, నాగలాపురం గ్రామాల మహిళలకు గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు.